ఎంఎస్ఎల్ పాయింట్‌లో తనిఖీలు

ప్రజాశక్తి - గోపాలపురం

గోపాలపురం ఎంఎస్ఎల్ పాయింట్‌లో ఆర్‌డిఒ రాణి సుస్మిత సోమవారం తనిఖీలు నిర్వహించారు. జెసి ఆదేశాల మేరకు గోపాలపురం పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలోని తనిఖీలు చేశామన్నారు. స్టాక్ వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఆమె వెంట తహాశీల్దార్ కె.అజయ్‌బాబు, సివిల్ సప్లయిస్ డిటి దివాకర్, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలకు అందించే సరుకుల పంపిణీ వివరాలు, రికార్డులో ఉన్న వివరాలకు సరిపోవాలని తెలిపారు.

తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్‌డిఒ రాణి సుస్మిత

ఆరోగ్యశ్రీకి అంతరాయం

బకాయిల చెల్లింపులో ప్రభుత్వ నిర్లక్ష్యం

పేదల ఆరోగ్యానికి దూరమైన ఆసరా

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

పేదల ఆరోగ్యానికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆరోగ్యశ్రీకి అంతరాయం ఏర్పడింది. బకాయిల చెల్లింపుల్లో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా సోమవారం ఆరోగ్యశ్రీ సేవలకు బ్రేక్ పడింది. జిల్లాలో ఈ పథకం ద్వారా 90 ఆస్పత్రులు రోగులకు సేవలందిస్తున్నాయి. వాటిలో ప్రభుత్వ ఆస్పత్రులు 36కాగా, ప్రైవేట్ ఆస్పత్రులు 39, ఇహెచ్ఎస్ 15 ఆస్పత్రులు ఉన్నాయి. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 3,255 రకాల సేవలు అందుబాటులో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎన్‌టిఆర్ వైద్య సేవగా పేరు మార్చిన విషయం విదితమే. అయితే నెట్ వర్క్ ఆస్పత్రులకు బిల్లులు చెల్లించడంలో శ్రద్ధ లోపించింది. ఈ నేపథ్యంలో బిల్లు బకాయిలపై ఆంధ్రప్రదేశ్ స్పెషాలిటీ హాస్పిటల్స్ అసోసియేషన్ (ఆషా) ఇప్పటికే పలు మార్లు విన్నవించుకున్నా కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదు.

ఆస్పత్రుల నిర్వహణ భారంగా మారిందని వైద్యులకే జీతాలు ఇవ్వలేకపోతున్నామని అప్పులు చేసి సేవలందించాల్సి వస్తుందని చెప్పినా ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. జిల్లా వ్యాప్తంగా ప్రైవేట్ ఆస్పత్రులకు ఒక్కో ఆస్పత్రికి సుమారు రూ.2 నుంచి రూ.10 కోట్ల మేర బకాయిలు నిలిచిపోయాయి. సుమారు రూ.200 కోట్లు బకాయిలు ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలో 90 శాతం ఆరోగ్యశ్రీ కేసులు జిల్లా కేంద్రానికే వస్తున్నాయి. అందులో ఎక్కువగా ఆర్థో, న్యూరాలజీ, యూరాలజీ, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్ కేసులు ఉంటున్నాయి. కొన్ని ఆస్పత్రులలో స్పెషాలిటీ డాక్టర్లు లేకపోవడంతో ఇబ్బందులు తప్పడంలేదు. ఇందులో గైనిక్, జనరల్ సర్జరీ కేసులు మాత్రం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి వస్తుండగా, పిడియాట్రిక్ కేసులు ప్రైవేట్ ఆస్పత్రులకు రిఫర్ అవుతున్నాయి. గుండెకు సంబంధించిన కేసులన్నీ ఎక్కువ సంఖ్యలో ఓ ప్రముఖ ఆస్పత్రికి రిఫర్ చేస్తున్నారు. నెట్ వర్క్ ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు నిలుపుదల చేయటంతో పేద, మధ్య తరగతి వర్గాల ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. జిల్లాలో సుమారు 10 లక్షల ఆరోగ్యశ్రీ కార్డులు ఉన్నాయి. ఇప్పటికే ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్లుగా ఉన్న వారికి ఆరోగ్యశ్రీ వర్తిస్తుందా అనేభయం వెంటాడుతోంది. జిల్లాలో ఇన్‌పేషెంట్లుగా ఇప్పటికే సుమారు వెయ్యి మందికిపైగా ఉన్నట్లు సమాచారం. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బకాయిలు చెల్లించి ఆరోగ్య శ్రీ అందుబాటులోకి తీసుకురావాలని రోగులు కోరుతున్నారు.

రోగులకు ఇబ్బందులు లేకుండా చర్యలు

జిల్లాలో నెట్‌వర్క్ ఆస్పత్రులకు సుమారు రూ.100 నుండి రూ.120 కోట్ల వరకూ బకాయిలు ఉన్నాయి. కొన్ని ఆస్పత్రులలో మాత్రమే సేవలు నిలిచాయి. కొన్ని ఆస్పత్రుల్లో యథాతథంగా సేవలు కొనసాగుతున్నాయి. ఇన్ పేషెంట్స్‌కు ఎటువంటి ఇబ్బందులు ఉండవు. ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులలో పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులో ఉన్నాయి. జిఎస్ఎల్ సహకారం తీసుకుంటున్నాము. రోగులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చికిత్స అందించేందుకు చర్యలు చేపట్టాము. ప్రతి నెట్ వర్క్ ఆస్పత్రిలో వైద్య మిత్రలు ఆరోగ్య శ్రీ కోసం వచ్చే రోగులకు పూర్తి సహకారం అందించేలా చర్యలు చేపట్టాము.

- డాక్టర్ ప్రియాంక, ఆరోగ్యశ్రీ కో ఆర్డినేటర్,తూర్పుగోదావరి జిల్లా

సంవత్సరం	సేవలు	నిధుల మంజూరు
2019-20	25770	రూ.62.71కోట్లు
2020-21	29602	రూ.62.15 కోట్లు
2021-22	47392	రూ.89.48 కోట్లు
2022-23	97955	రూ.191.43 కోట్లు
2023-24	10855	రూ.200.05 కోట్లు

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

ఇసుకను అందుబాటులో ఉంచాలి

జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం రూరల్

రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వ, ప్రైవేట్ రంగంలో చేపట్టనున్న నిర్మాణాలకు సంబంధించి అవసరమైన ఇసుక స్టాక్ యార్డుల్లో అందుబాటులో ఉంచాలని, దీనికి తగిన ప్రదేశాలను గుర్తించాలని కలెక్టర్ పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రీచ్‌లు నిర్వహిస్తున్న గ్రామాల పరిధిలో మౌలిక సదుపాయాలు, రహదారుల అభివృద్ధి కోసం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. నియోజక వర్గాల పరిధిలో అందుకు అనువైన ప్రదేశ ప్రతిపాదనలు అందించాలని ఆర్‌డిఒలకు సూచించారు. గృహ నిర్మాణాలు చేపట్టిన లే అవుట్‌లలో స్టాక్ యార్డులను ఏర్పాటు చేసేందుకు చర్యలపై చర్చించారు. ఆయా స్టాక్ పాయింట్లు రవాణా వ్యవస్థ అనుకూలంగా ఉండడం, తగిన నిఘా వ్యవస్థ పర్యవేక్షణ కోసం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. త్వరలో సెమి మెకానైజ్డ్ కింద పర్యావరణ అనుమతులు పొందిన 10 రీచ్‌ల ద్వారా 57,82,950 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులోకి వస్తుందన్నారు. ఇతర జిల్లాలకు కేటాయించిన కాటవరం, సింగవరం, కుమార దేవరం, తాడిపూడి, పెండ్యాల ఇసుక ర్యాంపులు పశ్చిమ గోదావరి, కాకినాడ, విశాఖపట్నం, అనకాపల్లి, ఏలూరు జిల్లాలకు సంబంధించిన డివిఎస్‌సి ఆధ్వర్యంలోనే నిర్వహణ, పర్యవేక్షణ కమిటీ సభ్యులు అంగీకారం తెలిపారు. 2024-2025 ఆర్థిక సంవత్సరానికి ఖనిజ ఆదాయ లక్ష్యం, సాధన లక్ష్యం రూ.380.3 కోట్లు కాగా రూ.390 కోట్లు సాధించామని జిల్లా మైన్స్‌అధికారి డి.ఫణిభూషణ్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో జెసి చిన్నరాముడు, అదనపు ఎస్‌పి మురళీకృష్ణ, ఆర్‌డిఒలు కృష్ణనాయక్, రాణి సుస్మిత, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బివి.గిరి, జిల్లా భూగర్భజల శాఖ అధికారి వై.శ్రీనివాస్, సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సంపత్ కుమార్, ఇరిగేషన్ డిఇ ఆనంద్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

జెఎల్ఎం, ఎఎల్ఎం పోస్టులు భర్తీ చేయాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం డివిజన్‌లో ఖాళీగా ఉన్న జెఎల్‌ఎం, ఎఎల్‌ఎం పోస్టులను భర్తీ చేయాలని, అంతవరకూ ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని 1104 యూని డిమాండ్ చేసింది. యూనియన్ డివిజన్ కార్యవర్గ సమావేశం డివిజన్ అధ్యక్షులు జివిఎన్.సతీష్‌కుమార్ అధ్యక్షతన సోమవారం జరిగింది. ఈ సమావేశానికి యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. డిస్కం సహాయ కార్యదర్శి కెటి.కిషోర్‌బాబు, జిల్లా కార్యదర్శి వివిఎస్.నాగేశ్వరరావు, యూనియన్ నాయకులు, కార్మికులు సమావేశంలో పాల్గొనఆనరు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు మాట్లాడుతూ డివిజన్‌లో సుమారు 100 పైగా జెఎల్‌ఎం, ఎఎల్‌ఎం పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా హయర్ పెన్షన్ అర్హత కోల్పోయిన ఉద్యోగులందరికి ఇపిఎఫ్ హయర్ పెన్షన్ వచ్చే విధంగా సర్కిల్ యాజమాన్యం ప్రయత్నం చేయాలన్నారు. ఎంతో ప్రమాదకరమైన సంస్థలో పని చేస్తున్న కార్మికులకు అపరిమిత వైద్య సదుపాయం కల్పించాలన్నారు.

2022 వేతన సవరణ అందరికీ అమలు చేయాలన్నారు.

రోడ్లకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-నల్లజర్ల

మండలంలోని ప్రకాష్‌రావు పాలెంలో రూ.9కోట్లతో నిర్మించిన నాలుగు బిటి రోడ్లు,రూ.60లక్షలతో నిర్మించిన సిసి రోడ్లను ఎంపీ పురందేశ్వరి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడారు. ఎన్‌డిఎ అధికారంలోకి వచ్చిన తరువాత శిథిలమైన రోడ్లను బాగుచేసుకుంటున్నామన్నారు. గత ప్రభుత్వం పోలవరాన్ని మరచిందని, నరేంద్ర మోడీ దీని కోసం ప్రస్తుతం రూ.12,500 కోట్లను విడుదల చేశారన్నారు. ఎంఎల్ఎ మద్దిపాటి వెంకటరాజు మాట్లాడుతూ నేషనల్ హైవేపై పలుచోట్ల రోడ్డు క్రాస్ చేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అక్కడ వంతెనలు ఏర్పాటు చేయాలన్నారు. ఆయా గ్రామాల ప్రజలు ఆమెకు వినతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ యద్దనపూడి బ్రహ్మరాజు. సర్పంచ్ కొత్తూరి జాన్ విక్టర్, నాయకులు తాతిన సత్యనారాయణ. పి.రతీష్. కె.ఉదయభాస్కరరావు. డి.సువర్ణరాజు, వై.సత్యనారాయణ. సర్పంచ్ సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ నిలుపుదల

ప్రజాశక్తి - పెరవలి

33/11 కెవి పెరవలి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కెవి ఖండవల్లి ఫీడర్ లైన్ మెయింటినెన్స్ నిమిత్తం ఖండవల్లి గ్రామానికి మంగళవారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సాయంత్రం 4 నుండి 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఇఇ ఎస్.నారాయణ అప్పారావు, ఎఇ డేవిడ్‌నిశ్చల ఒక ప్రకటనలో తెలిపారు. పిట్టల వేమవరం గ్రామంలో ఆర్‌డిఎస్ఎస్ పనుల్లో భాగంగా ఉదయం 6గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-కడియం

మండలంలోని జేగురుపాడులో రైతు సేవా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సర్పంచ్ స్టాలిన్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టాలిన్ మాట్లడుతూ 2024-25 రబీ పంటకు సంబంధించి ప్రభుత్వం క్వింటాకు రూ.2,300 మద్దతు ధర ప్రకటించిందన్నారు. 75 కేజీల బస్తాకు (సాధారణ రకం) రూ.1,725తో పాటుగా హమాలీ ఛార్జీలు, రవాణా ఖర్చులు కూడా ప్రభుత్వమే చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు నాగిరెడ్డి రామకృష్ణ, ఉప సర్పంచ్ పాతూరి రాజేష్, ఆకుల సుధాకర్, మర్రెడ్డి రమేష్, కర్రి చినబాబు, సిబ్బంది సుధీర్ కుమార్, కోటేశ్వరరావు రైతులు పాల్గొన్నారు.

డ్రెయినేజీలపై ఆక్రమణలు తొలగించాలి

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం

రోడ్ల విస్తరణకు అడ్డంకిగా డ్రెయినేజీలపై ఉన్న ఆక్రమణలను వెంటనే తొలగించాలని కమిషనర్ కేతన్ గార్గ్ పట్టణ ప్రణాళికా విభాగపు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కోరుకొండ రోడ్డు విస్తరణ పనులను పరిశీలించారు., రోడ్డుపై ఉన్న తాత్కాలిక ఆక్రమణలను, శాశ్వత ఆక్రమణలను గుర్తించి, వాటిని వెంటనే తొలగించాలని సూచించారు. కోరుకొండలో 80 అడుగుల రోడ్డుకు వైడెనింగ్ మార్కింగ్ చేయాలని పట్టణ ప్రణాళికా విభాగాన్ని ఆదేశించారు. నగరంలో ఆక్రమణలు తొలగించే కార్యక్రమం ప్రతి రోజూ నిర్వహించాలన్నారు. సిఅండ్‌డి వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. నిర్మాణంలో ఉన్న భవనాలను ఆకుపచ్చ గుడ్డతో మూసివేసేలా భవన నిర్మాణదారులను ఆదేశించాలన్నారు. ఆయన వెంట సిటీ ప్లానరు, అసిస్టెంటు సిటీ ప్లానరు, టౌన్ ప్లానింగ్ బిల్డింగ్ ఓవర్సీర్లు, మున్సిపల్ ఆరోగ్య అధికారి డాక్టర్ ఎ.వినూత్న

ఉన్నారు. అనంతరం పిజిఆర్ఎస్‌లో అర్జీలను స్వీకరించారు. వెబ్ ఎక్స్ ద్వారా సచివాలయ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. ప్రతి ఒక అధికారి సిబ్బంది తమకు కేటాయించిన విధులపై ఉదయం తనిఖీలు నిర్వహించాలన్నారు. ఎమినిటీస్ సెక్రటరీలు ఉదయం 6 గంటల నుంచి నీటి సరఫరా సరిగా జరుగుతున్నదీ లేనిది పరిశీలించాలన్నారు. శానిటేషను సెక్రటరీ డ్రైన్లలో ఉన్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలని, మాన్ హోల్స్‌పై షీట్లు వేసి చెత్తను లోపలికి వేయకుండా చూడాలని ఆదేశించారు. వేసవి పూర్తి అయ్యేలోగా కాలువలలో మట్టిని పూర్తిగా తొలగించాలన్నారు. ఎబిసి ఆపరేషన్స్ ఎక్కువ సంఖ్యలో చేయాలన్నారు. ఎంఎస్ఎంఇ, జెఎస్‌జెబి సర్వేలు త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వము 2025-26 సంవత్సరానికి మొత్తము పన్ను చెల్లించిన వారికి పన్నులు 5శాతం రాయితీ కల్పస్తూ ఉత్తర్వులు జారీ చేసిందని ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకోవాలని, దీనిపై ప్రచారం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనరు పివి.రామలింగేశ్వర్, ఎస్ఇ ఎం.సిహెచ్.కోటేశ్వరరావు, సిటీ ప్లానరు జి.కోటయ్య తదితరులు పాల్గొన్నారు.

సత్యనారాయణమూర్తికి నివాళు లర్పిస్తున్న మంత్రి కందుల దుర్గేష్

మాజీ సర్పంచ్ 'గట్టి' మృతి తీరని లోటు

ప్రజాశక్తి- కడియం

కడియం మండల రాజకీయాల్లో చెరగని ముద్ర వేసుకున్న సీనియర్ రాజకీయ నాయకులు, కడియపులంక మాజీ సర్పంచ్ గట్టి సత్యనారాయణమూర్తి మృతి వ్యక్తిగతంగా తనకు పెద్ద లోటని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. గట్టి సత్యనారాయణమూర్తి కుమారులు సుబ్బారావు, నరసయ్యలను మంత్రి సోమవారం పరామర్శించారు. గట్టి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దుర్గేష్ గట్టితో తనకు గల అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. అర్ధ శతాబ్దం పాటు రాజకీయాల్లో కొనసాగుతూ, పంచాయతీ సభ్యునిగా, సర్పంచ్‌గా, సొసైటీ బ్యాంక్ చైర్మన్‌గా, జిల్లా బ్యాంక్ డైరెక్టర్‌గా ఇలా అనేక పదవులు అలకరించిన ఆయన ఆ పదవులకే వన్నె తెచ్చారన్నారు. ఆయన ఇంటి పేరు గట్టని, మనసు మాత్రం వెన్న అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అలాగే తాడాల కొండరాజు, బాలేపల్లి మురళీధర్, గంగుమల్ల సత్యనారాయణ, పాఠంశెట్టి రవి, రావిపాటి రామచంద్రరావు, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, సంగీత సూరిబాబు, గడ్డం శివరత్నగణపతి, గిరజాల సూరిబాబు తదితరులు గట్టి సోదరులను పరమర్శించారు..

లక్ష్యాలను సాధించుకోవాలి

ప్రజాశక్తి - రాజానగరం

తల్లిదండ్రులు గర్వపడేలా, చదువుకున్న విద్యాసంస్థకు ముఖ్య అతిథులుగా రావడం, మన సంతకాలు ఆటోగ్రాఫ్‌లుగా మారడం ఈ మూడింటిని యువత లక్ష్యంగా చేసుకోవాలని, అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని సిబిఐ మాజీ జెడి లక్ష్మీనారాయణ అన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో 'దేశ నిర్మాణంలో యువత పాత్ర' అనే అంశంపై విద్యార్థులతో సోమవారం ముఖాముఖి నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా విసి ఎస్.ప్రసన్నశ్రీ, లక్ష్మీనారాయణ జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ యువత తీసుకున్న నిర్ణయాలు, కృషి ఫలితంగా ప్రపంచంలో జపాన్ వంటి దేశాలు అభివృద్ధి చెందాయన్నారు. నేటి యువత మొబైల్ ఫోన్స్‌తో బిజీగా ఉంటూ రీల్స్ చూస్తూ కాలాన్ని వృథా చేస్తున్నారన్నారు. సెల్‌ను మనం కంట్రోల్ చేస్తున్నామా? మనల్ని సెల్ కంట్రోల్ చేస్తుందా? అనే విషయాన్ని దృష్టిలో ఉంచుకోవాలన్నారు. మద్యం, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. ఎలాన్ మస్క్‌లా అనేక విషయాలపై పరిజ్ఞానం పెంచుకుంటే ఉన్నత స్థానాలకు చేరుకుంటా మన్నారు. సావిత్రబాయ్ పూలే వంటి మహనీయురాలి కృషి ఫలితంగా మహిళలు విద్యను అభ్యసిస్తున్నారని, మహనీయుల చరిత్రను చదువుకోవాలన్నారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ లోనే కాకుండా యవత్ భారతదేశంలో నెంబర్ వన్ యూనివర్సిటీగా ఎదగాలని ఆకాంక్షించారు. విసి మాట్లాడుతూ యువతే దేశం

లక్ష్మీనారాయణను సత్కరిస్తున్న విసి ప్రసన్నశ్రీ తదితరులు

బలమన్నారు. సమాజంలో విప్లవాత్మక మార్పులను తీసుకు రావడంలో యువకులు గణనీయమైన పాత్ర పోషించారని గుర్తు చేశారు. అనంతరం యూనివర్సిటీ సెమినార్ హాల్లో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బందితో జరిగిన సమావేశంలో విశ్వవిద్యాలయ అభివృద్ధిలో సిబ్బంది పాత్ర అనే అంశంపై లక్ష్మీనారాయణ ప్రసంగించారు విశ్వవిద్యాలయ అధికారులు, అధ్యాపకులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల మారేడుమిల్లి పర్యటన

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

రాజమహేంద్రవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల రాజకీయ శాస్త్ర విభాగం విద్యార్థులు మారేడుమిల్లికి క్షేత్ర పర్యటనకు వెళ్లారు. హెచ్‌ఒడి డాక్టర్ బాబ్జిపోతురాజు, లెక్చరర్ సయ్యద్ ఫరా యస్రూన్ ఆధ్వర్యంలో రంపచోడవరం ఐటిడిఎ కార్యాలయాన్ని సందర్శించారు. ఐటిడిఎ ఇన్‌ఛార్జి, అధికారులతో సంభాషించారు. అనంతరం కాఫీ తోటలను సందర్శించి స్థానిక రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. డిపార్ట్‌మెంట్ లెక్చరర్లు కెబిపిఎల్.సరోజ, రామకృష్ణ, రామారావు, రాజమండ్రి ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్‌కె.రామచంద్ర, పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ నిర్వహించిన స్టడీ టూర్ విజయవంతం కావడం పట్ల సంతోషం వ్యక్తపరిచారు. విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

కార్టూ'నిజం'



ఎయిడెడ్ జెఎసి జాయింట్ సెక్రటరీగా చిట్టిబాబు

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

స్థానిక మున్సిపల్ కాలనీలో గల బిబిఎం ఎయిడెడ్ ఉన్నత పాఠశాల కరెస్పాండెంట్ బి.చిట్టిబాబు ఎయిడెడ్ పాఠశాల యాజమాన్యాల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఆదివారం గుంటూరులో జరిగిన ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ల రాష్ట్రస్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో ఎయిడెడ్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఐక్యవేదిక ఏర్పాటైంది అని తెలిపారు. ప్రభుత్వం నుంచి అందిస్తున్న సహాయ సహకారాల విషయంలో మరింత సమర్థవంతంగా పనిచేసేందుకు ఎయిడెడ్ యాజమాన్యాలు అన్నీ ఏకం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఎయిడెడ్ పాఠశాలల ద్వారా రాష్ట్రంలో విద్యా వ్యవస్థకు ఎంతో మేలు కలిగిందన్నారు. ఎయిడెడ్ విద్యా సంస్థల వల్లే రాష్ట్రంలో పేద, మధ్యతరగతి పిల్లలకు విద్య అందుబాటులోకి వచ్చిన విషయాన్ని ప్రభుత్వాలు గుర్తించాలని ఆయన కోరారు. గత ప్రభుత్వ హయాంలో ఎయిడెడ్ పాఠశాలలు ఒత్తిడితో తీవ్రమైన సంక్షోభానికి గురయ్యాయన్నారు. ఎన్నికల సమయంలో ఎయిడెడ్ వ్యవస్థను బలోపేతం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. తదనుగుణంగా ప్రభుత్వం కొంత సానుకూల దృక్పథాన్ని చూపించాలన్నారు. ఎయిడెడ్ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఐక్యవేదిక కృషి చేస్తుందన్నారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం బి.శారద, ఉపాధ్యాయులు చిట్టిబాబు అభినందించారు.

వికలాంగులకు ఉపకరణాల పంపిణీ

ప్రజాశక్తి -రాజమహేంద్రవరం రూరల్

జిల్లా వికలాంగుల పునరావాస కేంద్రం ఆధ్వర్యంలో ఆరుగురు వికలాంగులకు ఉపకరణాలను అందించామని జెసి ఎస్.చిన్నరాముడు తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పిజిఆర్ఎస్‌లో ఉమా ఎడ్యుకేషనల్ టెక్నికల్ సొసైటీ, లాలా చెరువు సౌజన్యంతో పల్లిక సతీష్ కుమార్, నిమ్మల వెంకటేష్, రేలంగి దుర్గారావు,, కె.సంధ్యావతి, భావన శ్రీను, వనం వీరబాబులకు వీటిని అందించారు.

వేమగిరిలో 'తిరుమల' నూతన ప్రాంగణానికి భూమిపూజ

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

వేమగిరి హైవే పక్కన తిరుమల విద్యాసంస్థల నూతన ప్రాంగణానికి భూమిపూజ చేయడం ఎంతో ఆనందంగా ఉందని సంస్థ ఛైర్మన్ నున్న తిరుమలరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేమగిరి చుట్టుపక్కల ప్రాంతాల విద్యార్థులు, వారి తల్లిదండ్రుల కోరిక మేరకు తమ డేస్కాలర్ క్యాంపస్‌ను వేమగిరిలో ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ క్యాంపస్ ఎల్‌కెజి నుంచి ఇంటర్ వరకు క్లాసులు జరుగుతాయన్నారు. 2026-27 నుంచి అడ్మిషన్లు జరుగుతాయని తెలిపారు. తొలుత తిరుమలరావు, సరోజిని దేవి దంపతులు భూమిపూజ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తిరుమల విద్యాసంస్థల డైరెక్టర్ నున్న సరోజినీదేవి, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపల్ వి.శ్రీహరి, తిరుమల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

భూమి పూజ చేస్తున్న తిరుమలరావు దంపతులు

మరియమ్మ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - చాగల్లు

చాగల్లు భవిత కేంద్రంలో పనిచేస్తున్న ఆయా తొలిమి మరియమ్మ కుటుంబానికి రూ.30వేల ఆర్థిక సాయాన్నిసమగ్ర శిక్షా జిల్లా అధికారి కనకబాబు సోమవారం అందించారు. ఆమె వికలాంగ కుమారుడు మార్చి 30న మృతి చెందాడు. దీంతో మండలంలో పనిచేస్తున్న ప్రత్యేక ఉపాధ్యాయులు అందరూ కలిసి ఈ సొమ్మును అందించారు. ఈ కార్యక్రమంలో చాగల్లు హై స్కూల్ టీచర్ సిహెచ్.నాగపూర్ణిమ, ఎంఇఒ గణేష్, వెంకట్, రాజేష్, కొవ్వూరు మండలం భవిత కేంద్రం ఉపాధ్యాయులు రామచంద్రరావు పాల్గొన్నారు

యువకుని అనుమానాస్పద మృతిపై నిరసన

ప్రజాశక్తి - సీతానగరం

రఘుదేవపురం రాజుగారి గార్డెన్ ఫంక్షన్ హాల్లో వేమగిరి సునీల్ అనే యువకుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం స్థానికంగా కలకలం రేపింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఫంక్షన్ హాలు నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇవ్వకుండానే మతదేహాన్ని తరలించడంతో అనుమానాలు తలెత్తాయి. దీంతో బంధువులు పోస్టుమార్టం అనంతరం రాజుగారి గార్డెన్ వద్ద నిరసన చేపట్టారు. నిరసనకారులను ఇన్‌చార్జి సిఐ బాలశౌరి అదుపులోకి తీసుకున్నారు. ఆ తర్వాత మతదేహాన్ని రామచంద్రపురం గ్రామానికి తరలించారు. ఫంక్షన్ హాలు నిర్వాహకుడు అడ్డాల హరికృష్ణరాజు, సునీల్‌తో పాటు వచ్చిన యువతిపై చర్యలు తీసుకోవాలని సునీల్ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఇన్‌ఛార్జి సిఐ బాలశౌరి తెలిపారు.

నేరాలు ఘోరాలు

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న వాహనాలు

21 క్వింటాళ్ల బియ్యం సీజ్

ప్రజాశక్తి - రాజానగరం

పౌర సరఫరాల శాఖ చౌకధరల దుకాణాల ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న బియ్యాన్ని అక్రమంగా మూడు వాహనాల్లో తరలిస్తుండగా పట్టుకున్నామని రాజానగరం డిప్యూటీ తహశీల్దార్ గొలుగూరి బాపిరాజు తెలిపారు. వీటి విలువ సుమారు రూ.9,93,600 ఉంటుందన్నారు. జాతీయ రహదారి జిఎస్ఎల్ మెడికల్ కళాశాల సమీపంలో మూడు వాహనాల్లో రేషన్ బియ్యం తరలిస్తున్నారని సమాచారం అందడంలో ఏకకాలంలో దాడులు నిర్వహించారు. మొదటి వాహనంలో 15,390 కేజీల బియ్యాన్ని, రెండో వాహనంలో 3,670 కేజీలు, మూడోవాహనంలో 2,540 కేజీల బియ్యాన్ని పట్టుకున్నారు. గొల్లప్రోలుకు చెందిన ఆకుల స్వామి, పెద్దాపురం మండలం గోరంట్ల గ్రామానికి చెందిన కోరుకొండ అబ్బిరాజు, కోన బాలరాజులను అదుపులోకి తీసుకున్నారు. ఈ బియ్యం విలువ సుమారు రూ.9,93,600 ఉంటుందన్నారు. బియ్యాన్ని, మూడు వాహనాలను సీజ్ చేసి కేసులు నమోదు చేశామని తెలిపారు.

బైకుల చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

ప్రజాశక్తి - యు.కొత్తపల్లి

ద్విచక్ర వాహనాలను చోరీ చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు సిఐ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉప్పాడ నాయకర్ కాలనీకి చెందిన సూరాడ బాబు(20), చింతకాయల ఏసుబాబు (21) అరెస్టు చేసి వారి నుంచి 12 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. గొల్లప్రోలు, తొండంగి, పిఠాపురం టౌన్, కాకినాడ మండలాల్లో ద్విచక్ర వాహనాలను చోరీ చేసిన కేసుల్లో వీరు ముద్దాయిలుగా గుర్తించినట్లు తెలిపారు వీరిపై కేసు నమోదు చేసి కోర్టుకి తరలించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్ఐ వెంకటేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలోకి దూసుకెళ్లిన స్కూల్ వ్యాన్

ప్రజాశక్తి - గొల్లప్రోలు

మండలంలోని చెందుర్తి గ్రామంలో ఒక స్కూల్ వ్యాన్ అదుపుతప్పి కాలువలోకి దూసుకుపోయింది. పట్టణంలోని బైపాస్ రోడ్ లోని పిఎంఆర్ స్కూల్ వ్యాన్ విద్యార్థులను ఎక్కుంచుకుని చెందుర్తి వెళ్లి తిరిగి మరో గ్రామానికి వెళ్లే క్రమంలో 10 మంది విద్యార్థులతో అదుపుతప్పి కాలువలో తిరబడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు విద్యార్థులకు గాయాలయ్యాయి. మరో ఇద్దరు విద్యార్థులు కాలువలో నీటిని తాగడంతో వారిని పిఠాపురంలోని ఓ ప్రయివేట్ ఆస్పత్రికి తరలించారు. స్కూల్ ప్రిన్సిపల్ కె.కుమార సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు దీనిపై కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - పెద్దాపురం

పెద్దాపురం-వాలు తిమ్మాపురం రహదారిలోని పట్టాభి అగ్రో ఫుడ్స్ ఫ్యాక్టరీ డ్రెయిన్లో సోమవారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించింది. సంఘటనాస్థలాన్ని సిఐ విజయశంకర్, ఎస్ఐ మౌనికి పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి - గొల్లప్రోలు

పట్టణంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయాలపాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...పట్టణంలోని మార్కండేయపురంకి చెందిన పిల్లి అప్పారావు మేకలు కొనుగోలు చేయడానికి మోటార్ సైకిల్పై వెళుతుండగా గొల్లప్రోలు బైపాస్ మార్కెట్ యార్డ్ చెక్ పోస్ట్ వద్ద పిఠాపురం నుంచి కత్తిపూడి వెళుతున్న కారు అతివేగంతో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పిల్లి అప్పారావు తీవ్ర గాయాలపాలయ్యాడు. పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం మెరుగైన వైద్యం కోసం కాకినాడ జిజిహెచ్కు తరలించారు. బాధితుడు కుమారుడు పిల్లి ప్రకాష్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ఎన్.రామకృష్ణ తెలిపారు.

భూమి పూజ చేస్తున్న ఎంఎల్ఎ అశోక్

అభివృద్ధి పనులకు శ్రీకారం

ప్రజాశక్తి - యానాం

నియోజకవర్గ పరిధిలోని పలు గ్రామాల్లో ఎంఎల్ఎ నిధులు రూ. 51లక్షలతో చేపట్టే పనులకు ఎంఎల్ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ పరిధిలో డంపింగ్ యార్డు సమస్య శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తున్నానని, ఈ విషయంలో ప్రజల పడుతున్న తీవ్ర ఇబ్బందులు తాను అర్థం చేసుకోగలనని అన్నారు. సావిత్రినగర్లో రూ.8.67 లక్షలతో సిసి రోడ్డు, డ్రెయిన్, దరియాలతిప్పలో రూ.9.25 లక్షలతో క్రికెట్ ప్రాక్టీస్ పిచ్, రూ.13.07 లక్షలతో గుమ్మల్లా వీధి నుంచి బెజవాడవారి వీధి వరకు సిసిరోడ్లు, డ్రెయిన్లు, రూ.6.87 లక్షలతో స్టాబోర్డు కాలనీ నుంచి బెజవాడ గార్డెన్స్ వరకు రహదారి, రూ.12. 13 లక్షలతో సంతోష్ నగర్ లో సిసిరోడ్డు, రూ.4.54 లక్షలతో వికె కాలనీ, మెట్టకూరులో రీడింగ్ రూమ్ లకు భూమిపూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇన్ఛార్జ్ కమిషనర్ కె.రామకృష్ణ, పిడబ్ల్యుడి అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

జిల్లాలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహనా సదస్సులు, వైద్యశిబిరాలు, ర్యాలీలు జరిగాయి. **రాజమహేంద్రవరంలో** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, డిఎంహెచ్ఒ ఆధ్వర్యంలో స్థానిక ఉమెన్స్ కాలేజీ వద్దనున్న ఎస్టి హాస్టల్లో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎన్.శ్రీలక్ష్మి మాట్లాడారు. సమయానికి ఆహారం తీసుకుంటూ తగు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ ట్రైబల్ వెల్ఫేర్ అండ్ ఎంపవర్మెంట్ ఆఫీసర్ కెఎన్.జ్యోతి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. **ఉండ్రాజవరం** పిహెచ్సి వైద్యాధికారి ఆర్ఎస్ఎస్వి.ప్రసాద్ ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ 'ఆరోగ్యకరమైన ప్రారంభం - ఆశాజనక భవిష్యత్తు' అనే నినాదంతో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్, మైలవరపు సుబ్రహ్మణ్యం, పబ్లిక్ హెల్త్ నర్స్ కెడివిఎల్.కుమారి ఆరోగ్య సంరక్షణకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జిన్నూరి శ్రీనివాస్, మహిళా ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశాలు పాల్గొన్నారు. **సీతానగరం** కస్తూర్బా గాంధీ ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రాజమండ్రి రామకష్ణ మిషన్, వేమగిరి పరమహంస యోగానంద కంటి ఆసుపత్రి సంయుక్తంగా నిర్వహించాయి. ఈ శిబిరంలో డాక్టర్ వై. రామచంద్రరావు, డాక్టర్ వై. రాయుడు శ్రీనివాస్, డాక్టర్ పి. సత్యం, డాక్టర్ రమేష్బాబు 250 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో ఆశ్రమ ప్రతినిధులు పాల్గొన్నారు. **పెరవలి** కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన కార్యక్రమంలో ఇన్ఛార్జి మెడికల్ ఆఫీసర్ కె.హేమరాజ్, డాక్టర్ పి.తేజశ్రీ మాట్లాడారు. ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది కె.జయమణి, యేసురాణి, డి.కుమారి, అరుణకుమారి, జి.సత్యేంద్రకుమార్, కెవి.నాగేశ్వరరావు, ఆశాజ్యోతి, టి.రేణుక పాల్గొన్నారు. **కడియం** పిహెచ్సి పరిధిలో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ఎం.మణిజోత్స్న అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి ఎం.రామకృష్ణ, ఎంఎల్హెచ్పిలు, హెల్త్ అసిస్టెంట్లు, ఎఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.. **నల్లజర్ల** ప్రభుత్వాసుపత్రి అదనపు వైద్యాధికారి డాక్టర్ మహ్మద్ సిరాజుద్దీన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని నిర్వహించారు. సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ప్రజల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఆసుపత్రి ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు. **తాళ్లపూడి** మండలం అన్నదేవరపేటలో డాక్టర్ పి.స్వర్ణలత, మలకపల్లిలో పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ పి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. **గోకవరం** మండలం కొత్తపల్లి పిహెచ్సి వైద్యాధికారి డాక్టర్ తిరన్ అధ్యక్షతన ఆరోగ్య విస్తరణాధికారి డి.ఎన్.మూర్తి సమక్షంలో ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. గోకవరం ప్రభుత్వ ఆసుపత్రిలో వీరలంకపల్లి డాక్టర్. బిఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపల్ మంజులావేణి సమక్షంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ రామలక్ష్మి, డాక్టర్ ఝాన్సీ, హెచ్వి రాజేశ్వరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉండ్రాజవరంలో...

కడియంలో...

గోకవరంలో ర్యాలీ

జ్ఞాన వికాసానికి విజ్ఞాన యాత్రలు దోహదం

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

జ్ఞాన వికాసానికి విజ్ఞాన యాత్రలు దోహదం చేస్తాయని డిఎస్ఇఒ కంది వాసుదేవరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా నుంచి ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు రెండు రోజులపాటు నిర్వహించే విజ్ఞాన యాత్రను ఆయన సోమవారం లాలాచెరువు వద్ద జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన పాఠశాలల నుంచి 106 మంది ప్రాథమిక పాఠశాలల విద్యార్థుల కోసం మూడు బస్సులను ఏర్పాటు చేశామన్నారు. ఈ విజ్ఞాన యాత్రలో భాగంగా కాకినాడ, యానాం, విశాఖపట్నం తదితర ప్రాంతాల్లోని విజ్ఞాన, చారిత్రాత్మక ప్రాంతాలను వారు సందర్శిస్తారని తెలిపారు. జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ ఎస్ఎస్.సుభాషిణి మాట్లాడుతూ ఈ విజ్ఞాన యాత్రల వల్ల పుస్తకాల్లో చదువుకున్న ప్రాంతాలను విద్యార్థులు ప్రత్యక్షంగా చూసి అవగాహన చేసుకునే వీలుంటుందన్నారు. ఈ యాత్రలో విద్యార్థులతో పాటు జిల్లా సమగ్ర శిక్ష ఎఎంఒ ఎ.గౌరీశంకర్రావు, జిల్లా సైన్స్ ఆఫీసర్ శ్రీనివాస్ నెహ్రూ, 14 మంది గైడ్ టీచర్లు కూడా వెళ్తున్నారన్నారు. కూడా ఉన్నారని సుభాషిణి తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం అర్బన్ రేంజ్ డిఐ బి.దిలీప్కుమార్, కొవ్వూరు ఎంఇఒ బొబ్బిలి స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన యాత్రకు వెళ్తున్న విద్యార్థులు

మార్కెట్లో డ్రెయినేజీ పనుల పరిశీలన

ప్రజాశక్తి-కాట్రేనికోన

కాట్రేనికోన పంచాయతీ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో డ్రైనేజీ నిర్మాణ పనులను విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు స్థానిక నాయకులతో కలిసి సోమవారం పరిశీలించారు. మార్కెట్ ప్రాంతం కొద్దిపాటి వర్షానికే నీట మునిగిపోవడంతో రూ.కోటీ పది లక్షల నిధులతో ఆధునికీరణ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ ఇంజినీరింగ్ సిబ్బందిని పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇంజనీరింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో దాట్ల పవన్, పిఎస్ఎన్ రాజు, రవి వర్మ, వాసంశెట్టి రాజేశ్వరరావు, బండారు ఏసు, కడలి సత్యనారాయణ, కముజు రాంబాబు, వెంట్రు సుధీర్ తదితరులు ఉన్నారు.

చెరువుల తవ్వకాలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-కాట్రేనికోన

కందికుప్ప పంచాయతీ మిలటరీపేటలో రొయ్యల చెరువుల అక్రమ తవ్వకాలపై సమస్యల పరిష్కార వేదికలో గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. చెరువుల నీరు కాలుష్యంతో చర్మవ్యాధులు వస్తున్నాయని స్థానికులు కాశి ఆనంద్ కుమార్ అధర్వంలో పలువురు గ్రామస్తులు వాపోయారు. అక్రమ చెరువుల తవ్వకాల విషయం తెలుసుకున్న సిపిఎం నాయకులు దుర్గాప్రసాద్ కలెక్టరేట్ వద్ద గ్రామస్తులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. భవిష్యత్తులో గ్రామస్తులు చేసే ప్రతి ఉద్యమానికీ పార్టీ పరంగా ముందుండి అక్రమ చెరువు తవ్వకాలపై పోరాడుదాం అన్నారు.

పిజిఆర్ఎస్కు 193 అర్జీలు

జాయింట్ కలెక్టర్ చిన్నరాముడు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

కలెక్టరేట్ పిజిఆర్ఎస్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజల నుంచి 193 అర్జీలను స్వీకరించామని జాయింట్ కలెక్టర్ ఎస్.చిన్నరాముడు తెలిపారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అర్హత కలిగిన అర్జీల విషయంలో పరిష్కార విధానంలో చూపే శ్రద్ధ, పరిష్కారం కాని వాటి విషయంలో కూడా తగిన కారణాలు వివరించి అర్జీదారుడు సంతృప్తి చెందేలా చూడాలని అధికారులకు సూచించారు. జిల్లాలో 946 అర్జీలు రీ ఓపెన్ అయ్యాయన్నారు. వాటిలో ఇంకా 69 అర్జీలు పెండింగ్లో ఉన్నట్లు తెలిపారు. రీ ఓపెన్ చేసిన ప్రతి ఒక్క అర్జీదారునీతో వ్యక్తిగతంగా కలిసి పరిష్కారం వివరాలు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి టి.సీతారామమూర్తి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎంఆర్ఆర్ ప్రేమ్కుమార్, డిఎల్డిఒలు పి.వీణాదేవి, ఎ.స్లీవారెడ్డి, డిపిఒ శాంతమణి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అరీజలు స్వీకరిస్తున్న జెసి చిన్నరాముడు

అర్జునరావుకు ఎంఎల్ఎ పరామర్శ

ప్రజాశక్తి-కాట్రేనికోన

కాట్రేనికోన రామాలయం వీధిలో రిటైర్డ్ డిఎస్పి విత్తనాల అర్జున రావు భార్య మంగాయమ్మ ఇటీవల మరణించడంతో ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ దాట్ల సుబ్బరాజు సోమవారం అర్జునరావు కుటుంబ సభ్యులను పరామర్శించారు. అయన వెంట దాట్ల పవన్, పిఎస్ఎన్.రాజు, బండారు యేసు, వాసంశెట్టి రాజేశ్వరరావు, రిటైర్డ్ ఎస్ఐ కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, కె.రవి ఉన్నారు.

ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నిక

ప్రజాశక్తి-రామచంద్రపురం

రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్షునిగా ఉండవల్లి గోపాలరావు, ఉపాధ్యక్షునిగా గోవర్ధనం మల్లేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా బొడ్డు వరాహ నరసింహమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా పివిఎస్.జానకి, ఎన్వి.శేషు కుమార్, కోశాధికారిగా చింతపల్లి శ్రీనివాస్, క్రీడలు సంస్కృతిక విభాగానికి కార్యదర్శిగా సాదే నారాయణరావు, మహిళా ప్రతినిధిగా లకాని పద్మ కమల కుమారి ఎన్నికయ్యారు.

ఎస్సి రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం రూరల్

తూర్పు గోదావరి జిల్లా పరిధిలో ఎస్సి నిరుద్యోగులు ఉపాధి కల్పన కోసం వివిధ యూనిట్ల ఏర్పాటుకు రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల సహకార సంఘం లిమిటెడ్ కార్యనిర్వాహక సంచాలకులు జె.సత్యవతి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాకు మొత్తం రూ.3.71 కోట్లను 891 యూనిట్ల మంజూరుకు విడుదల చేసిందన్నారు. సబ్సిడీ రూ.1.4కోట్లు, బ్యాంకు లోను రూ.2.06 కోట్లు, లబ్ధిదారుని వాట రూ.1.85 కోట్లుగా నిర్ణయించారన్నారు. అర్హత కలిగిన లబ్ధిదారులు https://apobmms.apcfss.in దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఔత్సాహిక ఎస్సి. నిరుద్యోగ యువత ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 14 నుంచి వెబ్సైట్లో దరఖాస్తు అందుబాటులో ఉంటుందన్నారు. మే 10వ తేదీలో లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ పనులు వేగవంతం

ప్రజాశక్తి - ఆలమూరు

చెత్త నుండి సంపద సృష్టి పనులు వేగవంతం చేశామని ఇన్ఛార్జి డిఎల్పిఒ, ఎంపిడిఒ ఐ.రాజు అన్నారు. మండలంలోని నవాబుపేట, జొన్నాడ, చెముడులంక గ్రామ పంచాయతీలలో ఇంటింటికీ చెత్త సేకరణపై సోమవారం ఆయన ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంపద తయారీపై ఇప్పటికే శిక్షణ నిర్వహించామన్నారు. తడి, పొడి చెత్త సేకరణపై ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కూడా కల్పించామన్నారు. దీని వల్ల గ్రామంలో పరిశుభ్రతతో పాటు పంచాయతీలకు ఆదాయం కూడా సమకూరుతుందని ఆయన వివరించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రాంబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ పెద్దిరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నూకాంబిక ఆలయ అభివృద్ధికి విరాళం

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చింతలూరు శ్రీనూకాంబికా అమ్మవారి ఆలయ అభివృద్ధికి గుమ్మిలేరుకు చెందిన పారిశ్రామికవేత్త ముత్యాల వీర భాస్కరరావు, కృష్ణవేణి దంపతులు సోమవారం రూ.1,00,116 విరాళం అందజేశారు. తమ కుటుంబ సభ్యులైన ముత్యాల విజయకిరణ్, శ్రీవల్లి, ప్రమోద్ శౌర్య, ప్రణీత్ రామ్, ఉండవల్లి వీరవెంకట గోపీ చౌదరి, విజయలక్ష్మి, నిక్షిత్, ఆద్యలతో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాలిగోపురం నిర్మాణం నిమిత్తం ఈ మొత్తం విరాళాన్ని వినియోగించమని కోరుతూ దేవస్థానం ఇఒ ఉండవల్లి వీర్రాజు చౌదరి, ఉత్సవ కమిటీ చైర్మన్ గన్ని వెంకట్రావుకు అందజేశారు.

చట్ట పరిధిలో అర్జీలకు పరిష్కారం : ఎస్పి

ప్రజాశక్తి-రాజమహేంద్రవరం

నిర్దేశించిన సమయంలో చట్టపరిధిలో అర్జీలను పరిష్కరించాలి ఎస్పి డి.నరసింహకిషోర్ పోలీసులు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పిజిఆర్ ఎస్లో అర్జీదారుల నుంచి ఆయన అర్జీలు స్వీకరించారు. వారి కష్టాలను, బాధలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వెనువెంటనే నేరుగా సంబంధిత స్టేషన్ పోలీసు అధికారులతో జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఫిర్యాది దారుల సమస్యలను చట్ట పరిధిలో పరిష్కరించి, సత్వరమే న్యాయం చేయాలని ఆదేశించారు. ఎస్పి మాట్లాడుతూ 46 మంది నుంచి ఫిర్యాదులు స్వీకరించామన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పి (అడ్మిన్) ఎన్బిఎం.మురళీకృష్ణ, అడిషనల్ ఎస్పి (లాఅండ్ఆర్డర్) ఎవి.సుబ్బరాజు, ఎస్డి డిఎస్పి బి.రామకృష్ణ, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు, డిసిఆర్బి ఇన్స్పెక్టర్ పవన్కుమార్రెడ్డి పాల్గొన్నారు.

అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పి నరసింహకిశోర్

సేంద్రియ ఉత్పత్తుల మార్కెటింగ్పై సమీక్ష

ప్రజాశక్తి-అమలాపురం

సేంద్రియ వ్యవసాయంతోనే భూసార సంరక్షణ, ఆరోగ్య భద్రతతో పాటు మానవాళి మనుగడకు భరోసా ఉంటుందని జిల్లా జాయింట్ కలెక్టర్ నిషాంతి తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో వ్యవసాయ ఉద్యాన మార్కెటింగ్ రైతు సాధికారత, మున్సిపల్, స్వచ్ఛంద సంస్థలు డ్వాక్రా మెప్మా రిసోర్స్ పర్సన్లు, రైతు బజార్ ఎస్టేట్ అధికారులు, దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులతో సేంద్రీయ ఉత్పత్తుల సాగు మార్కెటింగ్ వినియోగంపై ఆమె సమీక్షించారు. పెరుగుతున్న ఆరోగ్య సమస్యలకు పరిష్కారం సహజ వ్యవసాయ పద్ధతుల ద్వారా పంటలను పండించడమే ఏకైక మార్గమని తెలిపారు. భవిష్యత్తులో పెట్టుబడి రహిత ప్రకతి సేంద్రియ పద్ధతిలో సాగును అవలంబించాలన్నారు. పట్టణ ప్రాంతాలలో తడి చెత్త వ్యర్థాలను కంపోస్టుగా రూపొందించుకుని ఆ కంపోస్టుతో టెర్రస్ గార్డెన్స్ పెంచుకునే గుడ్ ప్రాక్టీసెస్ అవలంబించే దిశగా రిసోర్స్ పర్సన్లు కృషి చేయాలని ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థలు వీటి పెంపకానికి అనువైనాంకేతికతను మెన్యూర్ తయారీ విధి విదానాలపై తగిన సహకారం అందిస్తారన్నారు. తద్వారా పట్టణాలలో వ్యర్థ పదార్థాలు తగ్గటమే కాక ప్రజలకు నాణ్యమైన ప్రకతి కూరగాయలు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి బోసుబాబు, మార్కెటింగ్ అధికారి కె.విశాలాక్షి, దేవాదాయ ధర్మాదాయ శాఖ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, రైతు సాధికార సంస్థ ప్రతినిధి శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ కెవివిఆర్.రాజు, రిసోర్స్ పర్సన్ పూర్ణిమ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జెసి నిషాంతి

కార్పొరేషన్ రుణాలకు ఇంటర్వ్యూలు

ప్రజాశక్తి-కె.గంగవరం

కె.గంగవరం మండలంలో సోమవారం బిసి కార్పొరేషన్, కాపు కార్పొరేషన్, ఇబిసి అభ్యర్థుల రుణాలకు సోమవారం బ్యాంక్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మండలంలో మొత్తం 2000 వరకు దరఖాస్తులు రాగా 1600 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. బ్యాంకులు ఎంతమందికి రుణాలు మంజూరు చేస్తాయో పూర్తిగా తెలియకపోవడంతో ఇంటర్వ్యూలకు వచ్చిన అభ్యర్థులు ఆందోళనకు గురయ్యారు. మండలానికి ఎన్ని లోన్లు మంజూరు అవుతాయనేది పూర్తిగా క్లారిటీ రాకపోవడంతో దరఖాస్తుదారులు నిరోత్సాహానికి గురయ్యారు.

కనకదుర్గమ్మ అమ్మవారికి వసంతోత్సవం

ప్రజాశక్తి-మామిడికుదురు

పెదపట్నంలంకలో కొలువుదీరిన కనకదుర్గమ్మ అమ్మవారికి సోమవారం వసంతోత్సవం పూజలు ఘనంగా నిర్వహించారు. ఏకాదశ రుద్రాభిషేకం, చామంతి పూజ, లలితా హోమం నిర్వహించారు.

దస్తావేజులు పోయినవి

గుమ్మాపు వెంకన్న, తండ్రి: సందయ్య, ఇంటి నెం.2-14, అంబేద్కర్ వీధి, అట్లపాడు, నిడదవోలు మండలం, తూ.గో.జిల్లా అను నేను నా ఒరిజినల్ డాక్యుమెంట్ నెం:294/1978రు గల డాక్యుమెంట్ను టూ వీలర్ మీద తీసుకొని నిడదవోలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుకు వెళు తండంగా దారిమధ్యలో పడిపోయినవి. ఎంత వెదికిననూ దొరకలేదు. కావున ఎవరికైననూ దొరికిన ఎడల పైన తెలిపిన చిరునామాకు అందజేయగలరు.

ఒరిజినల్ లింకు దస్తావేజులు పోయినవి

నా క్లయింటు కృష్ణా జిల్లా, వుయ్యూరు వాస్తవ్యులు **శ్రీ మదిరి కార్నెలియస్ గారి కుమారుడు శ్రీ వెంకట శశికుమార్** ఇచ్చిన సంజాయిషీ ప్రకారం నా క్లయింటు యొక్క **ఒరిజినల్ లింకు దస్తావేజులు** (1) **8045/2014,** Dt. **20-10-2014, SRO,** భీమవరం, (2) **4218/1987, Dt. 25-11-1987, SRO,** భీమవరం నెంబర్లు గల ఒరిజినల్ లింకు దస్తావేజులు నా క్లయింటు కవరులో పెట్టుకొని **ది. 28-3-2025వ తేదీన** రాజమండ్రి ప్రకాష్ నగర్లోని ఉన్న జంబో జిరాక్స్ వద్ద జిరాక్స్ నిమిత్తం వెళ్ళుచుండగా రాజమండ్రి ప్రకాష్ నగర్ రౌండ్ పార్క్ వద్ద పడిపోయినవి. ఎంత వెతికిన కనిపించలేదు. కనుక ఎవరికైన దొరికిన ఎడల ఈక్రింది అడ్రసుకు తెలియపర్చవల సిందిగా కోరుచున్నాము. తెలియపర్చిన వారికి తగిన బహుమతి ఇవ్వబడును.

యిన్నమూరి బాలసుబ్రహ్మణ్యం
దినేష్ రామినీడి, అడ్వకేట్స్
డో.నెం. 31-1-2/1, జె.పి.రోడ్,
రాజమండ్రి, సెల్: 97008 45909

IN THE COURT OF HON'BLE V ADDL. JFCM :: KAKINADA
O.S. 28/2023

Between:
ADAPA RAMACHANDRA RAO
S/o. Surya Prakasa Rao,
D.No. 5-1, Dugguduru Village,
Kajuluru ...Plaintiff
and
BEJAWADA SRINIVASA RAO
S/o. Bapanna Naidu, Lab Assistant,
Balaji Clinic Lab, D.No. 7-3-10,
Bejawada Street, Yanam,
Pondicherry State ...Defendant

పై నెంబరు దావాలో ప్రతివాదిపై వాది దాఖలు చేసిన దావాలో ప్రతివాది కోర్టువారి నుంచి వచ్చిన దావా సమన్లు వగైరాలు తీసుకొనకుండా కాలయాపన చేయుటమూలంగా శ్రీ కోర్టువారి ఉత్తర్వులమేరకు ఈ ప్రకటన జారీచేయడమైనది.

సదరు దావా **ది. 17-04-2025 తేదీని పై కోర్టులో ఉదయం గం. 10-30 ని॥లకు** పిలువబడునని, ప్రతివాది స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ హాజరై వివరణ యివ్వవలసినదని, లేని యెడల మీ పరోక్షంలో తీర్మానించబడునని తెలియజేయడమైనది.

అవసరాల నాగరాజు
ఆర్.ఎన్.వెంకట్
ఎం.మోహన్కుమార్
కాకినాడ
ది. 04-4-2025 అడ్వకేట్స్, కాకినాడ

CHANGE OF NAME

I, OGURI INDIRA (New Name), W/o JILLELLA ANIL KUMAR, Resident of Door No. 1-103, Mori Village, Sakhinetipalli Mandal, Dr. B.R. Ambedkar Konaseema District , AP. , I Hence by declare that my Name has been changed from **JILLELLA INDIRA** (Old Name) to **OGURI INDIRA** (New Name). Hence all my documents and correspondence will continue With My New Name of **OGURI INDIRA.**

ఇంటర్ మార్క్స్ లిస్ట్ పోయినది

గుడివాడ మండలం, గుడివాడ గ్రామ కాపురస్తురాలు, **గూడపాటి జయ శ్రీ, తండ్రి: కిరణ్** అను నాయొక్క పదవ తరగతి ఒరిజినల్ మార్క్స్ లిస్ట్ ది.01.04.2025వ తేదీన జిరాక్స్ తీయించుకొని నిడదవోలు నుండి గణపతి సెంటర్ దారి మార్గంలో స్కూటీమీద వెళుచుండగా పడిపోయినది. కావున ఎవరికైనా దొరికినచో నాకు అందజేయగలరు.

గూడపాటి జయ శ్రీ, తండ్రి: కిరణ్
ఫోన్: 9966911740

మహారాజశ్రీ 5వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు, రాజమహేంద్రవరం
M.V.O.P. No. 616/2024

Between:
Palika Subramanyam ***...Petitioner***
AND
Nurukurthi Durga Rao and Others
...Respondents

R-1: Nurukurthi Durga Rao, S/o. Veeranna, Hindu, age 51 years, Driver of Lorry bearing No. AP 05 TD 0789, R/o. D.No. 68-10/A-22/1, Near Saranya School, Rajeswari Nagar, Gaigolupadu, Kakinada Rural, Kakinada District.

R-2: Kandregula Varalakshmi, S/o. Satyanarayana, Hindu, age 40 years, Owner of Lorry bearing No. AP 05 TD 0789, R/o. D.No. 4-83, Srinagar, Vakalapudi, Kakinada, Kakinada District 533 003.
...1, 2 Respondents

పై నెంబరు పిటిషన్లో 1, 2 రెస్పాండెంట్లు అయిన మీకు కోర్టు ద్వారా ఎన్నిసార్లు సమన్లు/ నోటీసులు పంపినా మీరు వాటిని తీసుకోకుండా ఉద్దేశ్యపూర్వకంగా త్రిప్పి వేయుచున్నారు. కావున **ది. 21-4-2025 సం॥రం తేదీ ఉదయం 10.30 ని॥లకు** మీరు స్వయంగా గాని, లేదా ప్లీడరు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయ్యి సదరు పై పిటిషన్లో మీ ఆక్షేపణలను తెలుపుకొనవలెను. లేనియెడల సదరు పిటిషన్ను మీకు పరోక్షముగా శ్రీ కోర్టు వారు తీర్మానించెదరు.
(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)

డి.కుమారి దేవి
ఆర్.మైథిలి
రాజమండ్రి
07-4-2025 అడ్వకేట్స్, రాజమండ్రి

గ్రామపంచాయతీ కార్యాలయం, సూర్యారావుపేట

టెండరు నోటీసు

ఆ.క. నెం.04/2025 తేది.04-04-2025

డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, ఆలమూరు మండలంలోని సూర్యారావుపేట గ్రామపంచాయతీ 2025-2026 సం॥రంనకు ఈ దిగువ షెడ్యూల్ దాఖల సామాన్లు సప్లై చేయుటకు గాను టెండర్లు కోరబడుచున్నవి. సదరు టెండర్లు ది. 17-04-2025 తేదీన ఉదయం 11.00 ల వరకు సూర్యారావుపేట గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ కార్యదర్శి వారిచే గాని, వారి అనుమతిని మరియొకరిచే గాని టెండర్లు తీసుకొనబడి సదరు సీల్డు టెండర్లు అదేరోజు మధ్యాహ్నం 2.00 గంటలకు అప్పటికి హాజరైన టెండరుదారుల సమక్షంలో తెరవబడును. టెండరు ప్రక్రియకు సంబంధించి ఇతర విషయముల కొరకు గ్రామపంచాయతీ పనిచేయు వేళల యందు అడిగి తెలుసుకొనవచ్చును. ధరావత్తు చెల్లించని టెండర్లు స్వీకరించబడవు.

వ.నెం.	అయిటము వివరములు	టెండర ధరావత్తు
1	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన (పి.హెచ్. సామాగ్రి) ముగ్గు, బ్లీచింగ్, హైపోక్లోరైడ్ మొదలగు ప్రజారోగ్య సామాన్లు సప్లై చేయుటకు	రూ. 100/-
2	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన (పి.డబ్ల్యు.ఎస్. సామాగ్రి) చేతి పైపులు మరియు కుళాయి విడి భాగములు సప్లై చేయుటకు	రూ. 100/-
3	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన ఎలక్ట్రికల్ సామాగ్రి మరియు విడి భాగములు సప్లై చేయుటకు	రూ. 100/-
4	2025-26 సంవత్సరమునకు గాను గ్రామపంచాయతీకి కావలసిన నలుగురు స్వీపర్లు, ట్యాంక్ వాచరు - 1	రూ. 100/-

గమనిక: గ్రామపంచాయతీ నిధుల లభ్యతను బట్టి చెల్లింపులు చేయబడును.

సం/- **శ్రీమతి చింతపల్లి వెంకటలక్ష్మి**
సర్పంచ్, గ్రామపంచాయితీ, సూర్యారావుపేట
అమలాపురం మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

సం/- **శ్రీ కోట్ల హరేరామిరెడ్డి**
పంచాయితీ కార్యదర్శి, గ్రామపంచాయితీ
సూర్యారావుపేట, ఆలమూరు మండలం